# సంక్షేమమే మన ఎజెండా

- అభివృద్ధిని ఇంటింటా వివరించాలి
- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు
- జగ్గాసాగర్‌లో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం
- ఆశీర్వదించండి.. అండగా ఉంటా : కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 12: సంక్షేమమే మన ఎజెండా కావాలని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న పథకాలే అస్త్రాలుగా ప్రచారంలో ముందుకు సాగాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సూచించారు. గురువారం జగ్గాసాగర్‌లో మెట్‌పల్లి మండల బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ నాలుగుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించారని, ప్రస్తుతం కోరుట్ల ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తన కొడుకు డా. సంజయ్‌ను సైతం ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకం ఏదో ఒక రూపంలో ప్రతి ఇంటికి చేరిందన్నారు. ఆసరా, బీడీ కార్మిక, ఒంటరి మహిళ, వితంతు పింఛను, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ విజయంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సంక్షేమంతో పాటు గత తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను సైతం ప్రతి ఇంటింటికీ తిరుగుతూ వివరించాలని సూచించారు. ఏ గ్రామంలో ఎంత అభివృద్ధి జరిగింది..? ఎవరెవరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్న వివరాలను సైతం అందజేస్తామని, వీటిని ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజారెడ్డి, పార్టీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు గౌరె పుష్ప, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి, నాయకులు ముదాం నర్సింలు, డాకూరి వెంకటేశ్, పుల్ల జగన్‌గౌడ్ పాల్గొన్నారు.



మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

### ఆశీర్వదించండి.. అండగా ఉంటా



నేను మీ మనిషిని. నన్ను కోరుట్ల ఎమ్మెల్యేగా గెలిపించండి. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటా. ఆరు దశాబ్దాల్లో జరగని అభివృద్ధి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో జరిగింది. గడపగడపకూ సంక్షేమ ఫలాలు చేరాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించండి. కాంగ్రెస్, బీజేపీ అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టండి. నేను గెలిస్తే యువతకు స్థానికంగా ఉపాధి కల్పిస్తా. నియోజకవర్గంలో పరిశ్రమలను స్థాపించేందుకు కృషి చేస్తా.

- డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి

## బీఆర్‌ఎస్ పాలనలోనే యువతకు భవిత


- సీఎం కేసీఆర్ దూరదృష్టి కలిగిన గొప్ప నేత
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్
- గులాబీ పార్టీలో యువకుల చేరిక

మంథని, అక్టోబర్ 12: బీఆర్‌ఎస్ పాలనలోనే యువత ఉజ్వల భవిష్యత్‌కు భరోసా లభిస్తుందని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టి కలిగిన గొప్ప నాయకుడని కొనియాడారు. మంథని నియోజకవర్గం మహాముత్తారం మండలానికి చెందిన పంగ సురేశ్, పంగ దేవేందర్, కొయ్యాల మహేందర్, మంథెన లవకుమార్, మంథెన రాజబాపు, రామిల్ల వంశీ, ఆసంపెల్లి లచ్చయ్య, కొండ మల్లయ్య, మారపాక పోచయ్య, గంధం రాజబాపు, గోపాల్‌పూర్‌కు చెందిన పిడుగు పెద్ద కొమురయ్య మరో 20 మంది యువకులు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంథని రాజగృహలో మధూకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేండ్లలో ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా నియోజకర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కానీ 40 ఏండ్లుగా అధికారం వెలగబెడుతున్న కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీలేదని ధ్వజమెత్తారు. అండగా నిలిచేవారెవరో..అవినీతికి పాల్పడేవారెవరో ఆలోచించి ఓటేయాలని కోరారు.

## కోరుట్ల విద్యార్థులకు ప్రధాని మోడీ లేఖ

- పరీక్ష పే చర్చలో పాల్గొన్నందుకు అభినందనలు

కోరుట్ల, అక్టోబర్ 12: పరీక్ష పే చర్చలో పాలుపంచుకున్న జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధాని మోడీ లేఖ రాశారు. పరీక్షల ముందు చిన్నారుల్లో ఒత్తిడి పోగొట్టేందుకు ప్రతి ఏడాది నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ఇటీవల కోరుట్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు, ఫిజికల్ సైన్స్ టీచర్ నాగరాజు 'మై గావ్ యాప్' ద్వారా తమ అభిప్రాయాలు, సూచనలు, ప్రశ్నలు సంధించారు. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ఫిజికల్ సైన్స్ టీచర్ పేరుతో లేఖ గురువారం పాఠశాలకు చేరింది. ఇందులో పరీక్షా పే చర్చ కార్యక్రమంపై 'మీ నుంచి ఉపాధ్యాయ మిత్రుల నుంచి వచ్చిన అభిప్రాయాలు తెలుసుకోవడం చాల సంతోషంగా ఉంది. అందుకు గాను మీకు ధన్యవాదాలు, దేశం, విద్యార్థుల అభివృద్ధి కోసం మీ అభిప్రాయాలు చాలా విలువైనవి' అని ప్రధాని అభినందనలు తెలిపారు. 'మీ ఆలోచనలను పంచుకున్నందుకు మరోసారి ధన్యవాదాలు. మంచి ఆరోగ్యం సంతోషకరమైన భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు' అంటూ ప్రధాని మోడీ లేఖలో రాసుకొచ్చారు.



Prime Minister

Pariksha Pe Charcha 2023

కోరుట్ల: ప్రధాని మోడీ పంపిన లేఖ

### పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలి: జడ్పీటీసీ

శంకరపట్నం, అక్టోబర్ 12: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ తిరిగి ఓటర్లకు వివరించాలని జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లింగాపూర్, కొత్తగట్టు, మెట్‌పల్లి, మొలంగూర్, చింతలపల్లి, రాజాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా హాజరైన జడ్పీటీసీ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయానికి ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి కుటుంబం బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి ప్రతి కార్యకర్తా చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులికోట రమేశ్, సర్పంచుల ఫోరం చైర్మన్ పల్లె సంజీవరెడ్డి, సర్పంచ్ కిషన్‌రావు పాల్గొన్నారు.

## సుపారీ ఇచ్చి భర్తను హతమార్చింది

- ప్రవీణ్ హత్య కేసులో వీస్తుగొలిపే వాస్తవాలు

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 12: గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన కొచ్చర ప్రవీణ్ హత్య కేసులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. రూ. 5 లక్షల సుపారీ ఇచ్చి భార్య అతడిని హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. ప్రవీణ్ మరో మహిళతో చనువుగా ఉండడం, అతడు రియల్ ఎస్టేట్ ద్వారా సంపాదించిన నగదును ఆమెకు ఖర్చుపెడుతున్నట్లు అనుమానంతో భార్య లలిత.. ప్రవీణ్‌ను హతమార్చాలని పథకం పన్నింది. ప్రవీణ్ రియల్ ఎస్టేట్ సంస్థలో సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేసే రామగుండానికి చెందిన మచ్చ సురేశ్ సహకారంతో హత్యచేసినట్టు చేసినట్లు సమాచారం. సురేశ్‌కు ఒక ప్లాటు, రూ. 5లక్షల నగదు ఇస్తానని ఒప్పందం భార్య ఒప్పందం కుదుర్చుకున్నది. నిందితుడికి మూడు తులాల బంగారు పుస్తెల తాడును అందజేసింది. అలాగే ఈ హత్యలో సురేశ్‌తో పాటు రామగుండానికి చెందిన మరో వ్యక్తి, మందమర్రికి చెందిన మరో ముగ్గురు పాలుపంచుకున్నట్లు సమాచారం. పథకం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్నట్లుగా భార్య లలిత సురేశ్‌కు సమాచారం ఇచ్చింది. వారు ఇంటికి వచ్చి దిండుతోనే ముఖ్యంపై నొక్కి శ్వాస ఆడకుండా హతమర్చినట్లు తెలిసింది. లలిత నిద్రలో నుంచి మేలుకొని దవాఖానకు తరలించి గుండెపోటుగా చిత్రీకరించేందుకు యత్నించింది. అనుమానం వచ్చిన మృతుడి సోదరుడు, కేంద్ర సాయిధబలగాల్లో పనిచేస్తున్న తన బావ, తల్లి ప్రవీణ్ మృతిపై అనుమానంతో తాము వచ్చే వరకు పోస్ట్‌మార్టం అభ్యంతరం చెప్పారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు భార్య లలితను విచారించగా సుపారీ హత్యగా తేలింది.

# రాజన్న దీవెనతో సేవచేస్తా

- నేను ఈ ప్రాంత బిడ్డనే..
- గ్యారెంటీ లేని పార్టీలను నమ్మవద్దు
- బీఆర్‌ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ రూరల్, అక్టోబర్ 12: వేములవాడ రాజన్న దీవెనలు, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలకు సేవ చేస్తానని వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో గురువారం వేములవాడ రూరల్ బీఆర్‌ఎస్ నాయకుల సమావేశాన్ని మండలాధ్యక్షుడు గోస్కుల రవి ఆధ్వర్యంలో నిర్వహించగా, చల్మెడ, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, నేను ఈ ప్రాంత బిడ్డనేనని.. పక్కా లోకల్ అని స్పష్టం చేశారు. తనను విమర్శించేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్‌కు తెలంగాణపై పూర్తి పట్టు ఉన్నదని, మరోసారి ఆయనను ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. 60 ఏండ్లలో జరుగని అభివృద్ధిని కేవలం తొమ్మిదన్నర ఏండ్లలోనే కేసీఆర్ చేసి చూపించారని కొనియాడారు. మిగిలిపోయిన పనులను రాబోయే మూడేండ్లల్లో పూర్తి చేస్తామన్నారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ, వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. మూడోసారి సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేగా చల్మెడ లక్ష్మీనరసింహారావుకు భారీ మెజార్టీ అందించాలని కోరారు.



చెక్కపల్లిలో బీజేపీ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు



చెక్కపల్లిలో నిర్వహించిన సమావేశానికి హాజరైన కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు

### కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానం

వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట, అచ్చన్నపల్లి గ్రామాల నుంచి దాదాపు 150మంది బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా, చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశం, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ దేవరాజు, సర్పంచులఫోరం మండలాధ్యక్షుడు ఏశ తిరుపతి, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ కట్కం మల్లేశం, ఏఎంసీ వైస్ చైర్మన్ వెల్మ బాల్‌రెడ్డి, సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ వెల్మ నర్సవ్వ, సర్పంచులు పెండ్యాల తిరుపతి, పండుగ తిరుపతి, ఎంపీటీసీ మాల్లారం తిరుపతి, నాయకులు గడ్డం హన్మాండ్లు, సురేశ్, బాలు, అంజనీకుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.